## క్లుప్తంగా

### డీఎస్పీ విచారణ

కేతేపల్లి : మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో ఈనెల 3న జరిగిన వంటల సైదులు హత్య కేసుకు సంబంధించి మంగళవారం నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ మేరకు ఆయన గ్రామంలో హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన స్థలంలో సిబ్బంది చేత మరోమారు వివరాలు సేకరించారు. హత్యకు సంబంధించి పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుల విచారణలో భాగంగానే డీఎస్పీ గ్రామానికి వచ్చినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. డీఎస్పీ వెంట కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న దాతలు

శాలిగౌరారం : మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన జోగు మల్లయ్య కుటుంబానికి గ్రామానికి చెందిన శివమాలధారణ స్వాములు రూ.33వేల నగదును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన శివమాలధారణ భక్తులు, స్థానికులు కూతాటి సోములు, బొడ్డు నగేశ్, అనుముల మల్లేష్ తదితరులు ఉన్నారు.

### చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ పద్మ

మర్రిగూడ : పుట్టిన శిశువుకు ఆరు నెలల తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఖుదాబాక్షపల్లి పరిధిలోని బందకిందితండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు శోభ, నిర్మల, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, తల్లులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

రామగిరి (నల్లగొండ) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. తిప్పర్తి ఎస్‌ఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని కాజీరామారం నుంచి వంగూరి తేజ (17) అనే యువకుడు బైక్‌పై నల్లగొండకు వస్తుండగా మట్టితో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తేజ తలకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమాని శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఓ హాస్టల్‌లో జరిగిన ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలికలకు చెరో రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించి, వారి కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు కల్పించాలని కోరారు. పీఈటీ, వార్డెన్, ఆటోడ్రైవర్ వ్యవహరించిన తీరుపై విచారణ జరిపించాలన్నారు.


### ఎమ్మెల్యేకు వినతి

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రవి, తిరుపతి, సైదులు, రాములు, వీరేశ్, కోనేటి శ్రీను, నవీన్, రాంబాబు ఉన్నారు.

### వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర రంగాల్లోని కూలీలకు ప్రతిఏటా ఉచితంగా నిర్వహించే రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్యపరీక్షలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలోని పథకంపై అవగాహన కల్పించి ఉచితంగా ఆరోగ్య కార్డు దరఖాస్తు పత్రాలను అందజేశారు.

### వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన కార్తీక్

నల్లగొండ క్రైం : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పోలోజు కార్తీక్ అనే వ్యక్తి ఈనెల 1న తన ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మళ్లీ ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

# రైతుల్లో సాగునీటి గుబులు

- యాసంగిలో తీవ్రమవుతున్న సాగునీటి కొరత
- తగ్గిన భూగర్భజలాలు.. ఎండుతున్న బోర్లు
- సాగుకు దూరంగా 4వేల ఎకరాలు



నీరు లేక దమ్ముచేసి వదిలేసిన పొలం



నీరు అందక ఎండిన వరిపొలం

రామగిరి(నల్లగొండ) : యాసంగిలో సాగుకు నీటి సమస్య తీవ్రమవుతుండడంతో రైతన్న గుండెల్లో గుబులు మొదలవుతుంది. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లో నీరులేకపోవడంతో వరిపంట సాగు కష్టంగా మారింది. దీంతో భూగర్భజలాలు తగ్గి వేసిన బోర్లు ఆగిపోస్తున్నాయి. నెల క్రితం వరినాట్లు వేసుకున్న పొలాలు నీటికొరతతో ఎండుతున్నాయి. ఈ ఏడాది యాసంగి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. వానలు కురవకపోవడం, భూగర్భజలాలు అడుగంటడంతో పంటలు ఎండి రైతులపై పెట్టుబడుల భారం పడే అవకాశాలు ఉన్నాయి.

**తగ్గిన వరి సాగు..**

గతేడాది యాసంగి సీజన్‌లో తిప్పర్తి మండలంలో 30వేల 500ఎకరాలకు పైచిలుకు వరిసాగు జరిగింది. సాగునీటి కొరతతో ఈసారి 26,512 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. దిగుబడుల గురించి ఆలోచిస్తే ఖర్చులకు కూడా చాలేలా లేవని రైతులు పెదవి విరుస్తున్నారు. చాలా వరకు రైతులు వేయాల్సిన దానికంటే తక్కువ సాగు చేశారు. సాగర్ జలాశయం అడుగంటిపోవడంతో పానగల్లు నుంచి నీటి విడుదల కాకపోవడంతో చెరువులు, కుంటలు ఎండి భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో బోర్లు సరిగ్గా పోయడం లేదు. వేసిన బోర్లు సైతం పోయకపోవడంతో రైతుల్లో యాసంగి సాగు పంటలపై సందిగ్ధం నెలకొంది.

### 10కి పైగా బోర్లు వేశాము



ఈసీజన్‌లో 10కి పైగా బోర్లు వేశా. అందులో 650లకు పైగా అడుగులు వేసినా నీరు రాలేదు. వేసిన పంట ఎండిపోయే పరిస్థితి ఉంది. గతంలో వేసిన బోర్లు అన్ని ఎండిపోయాయి. చేసేది ఏమి లేక దేవుడిపై భారం వేశాము. ఏఎమ్మార్పీ కాలువ ద్వారా నీరు విడుదల జరిగితే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. – ఉయ్యాల ఎల్లమ్మ, తిప్పర్తి

### పొలాలు ఎండిపోతున్నాయి



2ఎకరాల్లో వరిసాగు చేశాను. నీరు సరిపడా అందక పొలం ఎండిపోతుంది. గత ఏడాది డిసెంబర్‌లో రెండు బోర్లు వేశాను ఒక్కడి కూడా పడలేదు. పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందా అనే సందేహం ఉంది.

– దుప్పలపల్లి సైదులు, తిప్పర్తి

# గౌడ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

నల్లగొండ రూరల్ : గౌడ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండలో ధర్మభిక్షం విగ్రహం ఏర్పాటు విషయమై మంత్రి దృష్టికి ఉద్యోగ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. అన్ని రకాలుగా తగిన సహకారం అందిస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో గౌడ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాంబాబుగౌడ్, పట్టణ మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కృష్ణమూర్తి, శంకర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌గౌడ్, సందీప్‌గౌడ్, సోమన్నగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సంతోష్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, మహేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై వేధింపులకు పాల్పడితే చర్యలు

నల్లగొండ క్రైం : మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని షీ టీం సీఐ గోపి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని చర్లపల్లి నలంద ఫార్మసీ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో పోలీస్ నుంచి కలిగే రక్షణ, భద్రత, భరోసాపై అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలను వేధిస్తే షీ టీం నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, అత్యవసరమైతే వెంటనే 100కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రావు, సురేష్, కృష్ణారెడ్డి, ఏఎస్‌ఐ విజయలక్ష్మి, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ నళిని, నర్సింహ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గుత్తా అఖిలరెడ్డి

నల్లగొండ టూటౌన్ : ప్రజలు దైనందిన జీవితంలో పనిఒత్తిడి లేకుండా ఉండి తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓరల్ కేన్సర్, మహిళలకు బెస్ట్ స్క్రీనింగ్ వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏ వ్యాధినైనా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే దాని నివారణ సులభం అవుతుందన్నారు. బుధవారం కూడా వైద్యశిబిరం కొనసాగుతుందని, మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో వైద్యులు వంద మందికిపైగా వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తా అఖిలరెడ్డి, స్థానిక కౌన్సిలర్ యామ కవిత దయాకర్, వనం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ దైద రజితరెడ్డి, అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, రంగా వెంకన్న, ఏపీఎస్ అమరేందర్, పీఏ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రావు

నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు గ్రామాల్లో వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. విజన్ భువనగిరి పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సువర్ణగార్డెన్‌లో మంగళవారం బీజేపీ నకిరేకల్ అసెంబ్లీ సెగ్మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అసెంబ్లీ సెగ్మెంట్ సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ మండల వెంకన్న, నాయకులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, పల్స శ్రీనుగౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టూటౌన్: సంతకాల సేకరణ చేస్తున్న హమాలీ వర్కర్స్ నాయకులు



చిట్యాల : మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు


నల్లగొండ టూటౌన్ : ఈనెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎలక్ట్రికల్ స్టోర్‌లో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ స్టోర్‌లో పనిచేస్తున్న వర్కర్లందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, కార్యదర్శి శంకర్, యాదగిరిరెడ్డి, నరసింహ, చంద్రం, కృష్ణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు మంగళవారం స్థానిక పెద్ద గడియారం సెంటర్‌లో తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, నరసింహ, సాలయ్య, సత్తయ్య, రవి, సైదులు పాల్గొన్నారు.

**దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి**

చిట్యాల : రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు లేబర్ విధానాన్ని అన్ని రంగాల్లో పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏనుగు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహ, నాయకులు జడల నర్సింహ, పాల లక్ష్మయ్య, బాకి అండాలు, మేడి శోభ, ఉప్పలపల్లి ఇందిరమ్మ, పోకల ముత్తయ్య, మేడి శేఖర్, జిట్ట మణెమ్మ, మీసాల కిషన్, ధనలక్ష్మి, అండాలు, పద్మ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత




మెటీరియల్ అందజేస్తున్న పాండురంగారావు

కనగల్ : మండల కేంద్రంలోని శ్రీఅక్కెనపల్లి వెంకటేశ్వర్‌రావు మెమోరియల్ మోడల్‌స్కూల్‌లో మంగళవారం పదోతరగతి 100మంది విద్యార్థులకు పీఆర్‌ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో గణితం, సైన్స్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్ ప్రాముఖ్యత, పదోతరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు ఏలా సాధించాలనే మెళకువలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్ అందజేసిన పీఆర్‌ఆర్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాల్‌ప్రకాష్, అఖిల్, ఈగల స్వరూప్‌రెడ్డి, సంధ్య, సలీం, శ్రీనివాస్, విజయ్ తదితరులున్నారు.

### పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

చండూరు : మండలంలో పారిశుద్ధ్యంపై బుధవారం నుంచి నిర్వహించే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ యాకూబ్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్, మద్యం, గుట్కా దురలవాట్లపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 15న జిల్లా కేంద్రంలో కార్మికులకు సన్మానం ఉంటుందని తెలిపారు. సమావేశంలో గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజల చేతిలో బాల్క సుమన్‌కు శిక్షతప్పదు



మునుగోడు : బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండవేసి ఆందోళన చేస్తున్న నాయకులు



కేతేపల్లి : పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కేతేపల్లి : సీఎం రేవంత్‌రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ప్రజల చేతుల్లో శిక్ష తప్పదని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**బాల్క సుమన్‌పై ఫిర్యాదు**

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌యాదవ్, నాయకులు మున్న అశోక్, కొండ మహేష్, ఏర్పుల నాగరాజు, గౌతమ్ కుమార్, మున్న సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**బాల్క సుమన్ చిత్రపటం దహనం**

మునుగోడు : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బూతుపదాలతో విమర్శించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆయన చిత్రపటానికి చెప్పుల దండవేసి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బోయపర్తి ప్రసాద్, మండల అధ్యక్షుడు నక్క వెంకన్న, పట్టణ అధ్యక్షుడు పాలకూరి మహేష్‌గౌడ్, కాటం వెంకన్నగౌడ్, ఉప్పునూతల భాస్కర్, చేపూరి రవీందర్, నర్సింహ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర పదజాలంతో దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసి రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాకాల సతీస్, పెరుమాండ్ల నరేశ్, లోడంగి మహేశ్, వేముల భరత్, మిర్యాల సాయి, రమేశ్, అనిల్, వెంకన్న, యాదయ్య, నగేశ్, రాకేశ్, సైదులు, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# 11న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి (నల్లగొండ) : పట్టణంలోని పాతబస్తి హనుమాన్‌నగర్‌లోని పొట్టిగడ్డపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 11న 18అడుగుల హనుమాన్ ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ హనుమాన్ విగ్రహాన్ని తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురంలో ప్రఖ్యాత శిల్పులచే చెక్కించారు. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ నిర్మాణ విశిష్టతపై ప్రత్యేకంగా పాటను రూపొందించాలని సంకల్పించి డాక్టర్ బసవరాజు సురేష్ –సరిత దంపతులు ప్రముఖ డైరెక్టర్, రచయిత, గాయకుడు చిన్ని చరణ్ సహకారంతో పాటను పూర్తి చేసి మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బైరగోని రాజయ్యగౌడ్, కార్యదర్శి బండారు ప్రసాద్ మాట్లాడారు. బుధవారం పట్టణంలో విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొననున్నట్లు తెలిపారు. అంతకుముందు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐబీసీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఏచూరి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి సతీష్, ప్రతిష్ఠాపన మహోత్సవాల అన్నదాత పెరిక సురేష్, గుండెబోయిన వెంకన్న, ఎడ్ల శ్రీనివాస్, గుంటి రమేష్, రావిరాల కాశమ్మ, మామిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# దర్వేశిపురం ఆలయంలో మున్సిపల్ చైర్మన్ పూజలు



పూజలు చేస్తున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

కనగల్ : నల్లగొండ పట్టణ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు మంగళవారం మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ చీదేటి వెంకట్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# బీజేపీ అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న బీజేపీ అభ్యర్థులపై ఆ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర సీనియర్ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్, పరిశీలకుడు కొప్పుల నరసింహారెడ్డి పాల్గొని పార్టీ కార్యాలయంలో ఒక్కో నాయకుడిని పిలిచి వారి నుంచి వ్యక్తిగతంగా అభ్యర్థుల పేర్లు వివరించి అభిప్రాయాలను ధ్రువీకరించుకున్నారు. పార్టీ నాయకుల అభిప్రాయాల నివేదికను పార్టీ రాష్ట్ర నాయకత్వానికి అప్పగించనున్నారు.

# గ్రామ పాలకవర్గానికి సన్మానం



సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ

మునుగోడు : గ్రామపంచాయతీల పాలకవర్గం పదవీకాలం ముగియడంతో మండలంలోని జక్కలవారిగూడెం పాలకవర్గ సభ్యులను మంగళవారం ఆ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్ జక్కలి శ్రీనుతో పాటు వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, సర్పంచ్ జక్కలి శ్రీను, ఉపసర్పంచ్ జక్కలి నర్సింహ, కార్యదర్శి శ్వేత, వివిధ శాఖల సిబ్బంది, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆలయంలో చోరీ

మునుగోడు : మండల కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో గల కనకదుర్గా దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని ఆలయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయం తాళ్లాలు పగలగొట్టి దేవతపై ఉన్న గ్రాము బంగారం, వెండి పాదాలు, శఠగోపురంతో పాటు హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయ పూజారి వచ్చేసరికి తాళం పగలగొట్టి బంగారం, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లడాని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నల్లగొండ నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలను సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## ‘చెప్పలేని’ ఆనందం

నల్లగొండ పట్టణంలోని అవుట్ డోర్ స్టేడియంలో రెండు రోజులుగా దివ్యాంగులకు క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దివ్యాంగులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్న చెవిటి, మూగ క్రీడాకారులు వారు భావాలను మాటలు రాకుండా ఫోన్లో వాట్సప్ కాల్‌లో వారి సైగల ద్వారా చెప్పరాని మాటలను మూగ గుండె రాగాలతో వారి భావాలను వ్యక్తపరిచారు. పోటీల్లో గెలుపొందిన చెవిటి, మూగ క్రీడాకారుల ఆనందంతో మెడల్స్, సర్టిఫికెట్లతో వారి స్నేహితులతో సైగల ద్వారా సంతోషాన్ని పంచుకున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ఫోన్లో స్నేహితులతో సైగలతో మాట్లాడుతున్న దివ్యాంగులు



క్రీడల్లో గెలుపొందిన వారి గురించి సైగల ద్వారా చర్చిస్తున్న దివ్యాంగులు



సైగలతో మాట్లాడుకుంటున్న దివ్యాంగులు



మెడల్స్ గెలుపొందడంతో సైగలతో సంతోషాన్ని పంచుకుంటున్న క్రీడాకారులు